క్లుప్తంగా

భక్తులకు లడ్డూ ప్రసాదాలు సిద్ధం



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ల వేడుకలకు పెనుగంచిప్రోలు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు రోజుల ఉత్సవాలకు సంబంధించి భక్తులకు బుధవారం నుంచి లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం 1.50లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్నామని, అవసరమైతే అప్పటికప్పుడు ప్రసాదాలు తయారుచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆలయ ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు రాత్రి సమయంలో ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉత్సవాల విజయానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఐదు స్టాళ్లకు అనుమతి

కంచికచర్ల: స్థానిక రైతుబజార్‌లో అర్హతగల డ్వాక్రా గ్రూపు సభ్యులు ఐదు స్టాళ్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎస్టేట్ అధికారి ఆర్.అజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. వారంలోగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను విజయవాడ గొల్లపూడిలోని జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారికి సమర్పించాలని ఆయన సూచించారు.

యువత పోరుకు తరలివెళ్లిన నేతలు



జగ్గయ్యపేటఅర్బన్: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమంలో పాల్గొనేందుకు జగ్గయ్యపేట నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు, నిరుద్యోగులు, విద్యావేత్తలు పలు వాహనాల్లో బయలుదేరి విజయవాడకు తరలివెళ్లారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట పట్టణం, పేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలు, నందిగామ మండల పరిధిలోని పేట నియోజకవర్గానికి చెందిన ఏటిపట్టు గ్రామాల నుంచి వివిధ వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు బయలుదేరివెళ్లారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన పుట్ట ఉదయ్, పద్మ తేజస్వి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా నగదును అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

నందిగామరూరల్: జాతీయస్థాయిలో నిర్వహించిన క్యాట్ లెవల్–2 పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి సత్తా చాటారని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ పవార్ తెలిపారు. స్థానిక పాఠశాలలో ప్రతిభ చూపిన వారిలో ఏడుగురు విద్యార్థులకు నగదు బహుమతి, 19 మందికి మెడల్స్, 32 మందికి మెరిట్ సర్టిఫికెట్లను బుధవారం ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి పరీక్షలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించి, అభినందించారు. ఏజీఎం మురళీకృష్ణ, ఆర్‌ఐ వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు ఫైనలియర్‌కు చెందిన మొత్తం 80మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 50మంది ఏజీఎస్ హెల్త్ మల్టీనేషనల్ కంపెనీలో మెడికల్ కోడింగ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బుస్సా సురేష్ తెలిపారు. వీరికి ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల ప్యాకేజీ అందుతుందని వివరించారు. కరస్పాండెంట్ సరిత పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్ సీపీ బలం

మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు కేక్‌లను కట్ చేసి, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. నందిగామలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పతకాన్ని మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆవిష్కరించారు. అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి కార్యకర్తలు, నాయకులే బలమని, వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఒక్కరితో ప్రారంభమైన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుని ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలన సాగించిందని పేర్కొన్నారు. మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో విలువలు, విశ్వసనీయతతో కూడిన పాలన అందించారన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. 2014–19కాలంలో చంద్రబాబు పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ పథకానికి జగన్‌మోహన్‌రెడ్డి జీవం పోశారన్నారు. నిరుపేదల్లో విద్యాభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందన్నారు. రానున్న కాలంలో పార్టీ విజయమేలక్ష్యంగా ప్రతిఒక్కరు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, చింతా రవీంద్ర, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బుడ్డి సత్యనారాయణ, శాఖమూరు వెంకట కుమారి, ముప్పల శ్రీను, మాడుగుల మనోహర్, మార్త శ్రీను, విజయలక్ష్మీ, దుర్గ, నాగమ్మ, పోతురాజు, షేక్ సుభాని, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

పెద్దాపురం(వీరులపాడు): కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు.పెద్దాపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



నందిగామ వైఎస్సార్ సీపీ ఆఫీసులో మహానేత వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, నాయకులు

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పేదవర్గాల అభ్యున్నతి, రైతు సంక్షేమం కోసం ఎనలేని కృషిచేసిందని ఆపార్టీ నాయకులు దేవరకొండ గురవయ్య, పెదబాబు, మాడుగుల మధుబాబు అన్నారు. కంచికచర్ల గొట్టుముక్కల రోడ్డులో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం జరుపుకున్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు 51 నుంచి 58శాతం వరకు రాజకీయ పదవులు, నామినేట్ పదవులు ఇచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు మంగినేని వెంకట్రామయ్య, నానిరెడ్డి, శ్యామ్, నాగేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదాద్రిలో గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన సెంటరులోని మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు మాట్లాడుతూ ప్రజల కష్టాల నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని పేర్కొన్నారు. గ్రామనాయకులు పాల్గొన్నారు. గౌరవరంలో గ్రామ పార్టీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ కన్వీనర్ ఆదూరి కిషోర్, నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, జగదీష్, నాని, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గండ్రాయి, చిల్లకల్లు, బూదవాడ తదితర గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



కంచికచర్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు గురవయ్య, పెదబాబు తదితరులు

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయితో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వత్సవాయిలోని గాంధీ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద ఆపార్టీ మండల అధ్యక్షులు గుత్తా శంకరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొలికిపోగు వెంకటేశ్వర్లు కేక్ కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మక్కపేట గ్రామంలో కనగాల రమేష్, భీమవరంలో నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, కంభంపాడులో వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, దబ్బాకుపల్లిలో సర్పంచ్ కొట్టె నగేష్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. చిన్నారులకు మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు లేళ్ల నాగేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ దారావతు రూప్లానాయక్, మిట్టకోలు నరేష్, కుక్కల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: ప్రజల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ అన్నారు. పెనుగంచిప్రోలులో పార్టీ మండలాధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.తొలుత గ్రామంలోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలనలలో ప్రజలకు సువర్ణయుగం నడిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, ట్రేడ్ యూనియన్ నాయకులు టి.సోమయ్య, నాయకులు ఉన్నం శ్రీనివాసరావు, బోశెట్టి బ్రహ్మం, నక్కా సుధాకర్, మధుసూధనరెడ్డి, గడాటి పెద్దోడు, ముసిబోయిన సైదులు, మెండెం దాసు, వెంకటరత్నం, నల్లబోతుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటానికి చిహ్నం...

వైఎస్సార్‌సీపీ జెండా తెలుగోడి ఆత్మ గౌరవానికి, అలుపెరగని పోరాటానికి చిహ్నమని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సత్రం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు ఓర్సు కొండలు, గోపయ్య, బత్తుల వెంకటనర్సు, షేక్ మదార్‌సాహెబ్, తమ్మిశెట్టి రాములు, పరగటి మధుమురళి, బండి వీరాస్వామి, ఉదయ్‌బాబు, తుమ్మల వెంకటరమణ, పల్లి వనమాలి పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



జగ్గయ్యపేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: కోట్లమంది అభిమానులతో దేశంలోనే ప్రాంతీయ పార్టీల్లో అత్యధిక ప్రజాదరణ ఉన్న పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం తన్నీరు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా సంక్షేమ పాలనను అందించిందన్నారు. దేశంలోనే కనివిని ఎరుగని రీతిలో రూ.2.70లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేసి రికార్డు సృష్టించారన్నారు.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావమే దేశచరిత్రలో ఒక సువర్ణాధ్యాయాన్ని సృష్టించిందన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సమరోత్సాహంతో పనిచేస్తున్నారంటూ వారికి అభినందనలు తెలియజేశారు. కర్యాక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, జిల్లా కార్యదర్శులు వేముల మల్లేశ్వరరావు, మాతంగి నాగబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, విజయవాడ దుర్గ గుడి దేవస్థాన మాజీ డైరెక్టర్ నంబూరి రవి, ఎస్టీ, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బద్దూనాయక్, శామ్యూల్, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, న్యాయవాదులు సత్యశ్రీనివాస్, పృథ్వీ, పట్టణ యూత్ ప్రధానకార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, మహిళా అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, మహిళా నేతలు చల్లా సుశీల, ధరావత్‌శ్యామల, కాసరగడ్డ సీత, సైదాబీ, కార్మిక, ప్రచార విభాగాల అధ్యక్షులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గూడపాటి శేషగిరిరావు, బాణావత్ రాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అన్నాబత్తుల శ్రీను, ఎస్సీసెల్ నాయకుడు ఉప్పెల్లి పెంటయ్య, నాయకులు బీఎస్ఎన్ఎల్ రామారావు, దర్శి వెంకటేశ్వరరావు, ఇమ్రాన్ పాషా, మారిశెట్టి అనిల్, శీలం ప్రభాకర్, బండి రాజు, నర్సింహారెడ్డి, పెద్ద సైదులు, మందడపు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, పక్కన నాయకులు



జగ్గయ్యపేట మండలం వేదాద్రిలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



పెనుగంచిప్రోలులో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ మార్కపూడి గాంధీ, బత్తుల రామారావు, పొన్నం కోటేశ్వరరావు తదితరులు



పెనుగంచిప్రోలులో పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సర్పంచి వేల్పుల పద్మకుమారి, కొండలు, వెంకటనర్సు తదితరులు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


కంచికచర్ల: ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ తక్షణమే విడుదల చేయాలని కోరుతూ కంచికచర్ల జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి. గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్, ఉపసర్పంచి బెల్లంకొండ సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రమేష్ బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశను కలిసి వినతిపత్రం అందజేశారు. కంచికచర్ల మండలం గండేపల్లిలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గతేడాది విడుదల చేయాల్సిన ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,200 కోట్లు ఉన్నాయని వాటిని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వేసవికాలం రాకముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, బోరు పంపులు కూడా సక్రమంగా పనిచేయడం లేదంటూ సమస్యను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. గండేపల్లి నుంచి కీసర వెళ్లే తారురోడ్డు అధ్వానంగా ఉందని, రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు. సెంటిని ఫ్యాక్టరీకి నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు ఈరోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటోందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేసుకునేలా ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు. వైరా కట్టలేరు నుంచి సెంటినీ ఫ్యాక్టరీ నీటిని తరలించేందుకు వేస్తున్న పైపులైన్ అనుమతి ఇవ్వకుండా, సమీపంలో సాగవుతున్న 500 ఎకరాల సాగు భూమిని కాపాడాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయాన్ని పర్యావరణ శాఖకు రిఫర్ చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు ప్రశాంతి, నాయకులు

ముత్యాలమ్మకు బోనాలు సమర్పణ

కీసర(కంచికచర్ల): మండలంలోని కీసరలో ముత్యాలమ్మ, పోతురాజు స్వామివార్ల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, జలబిందెలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంభాభిషేకం చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అనంతరం 10వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ అమ్మవారి కమిటీ సభ్యులు పరిటాల వీరభద్రరావు, రాము, నూకార్జున, రామకృష్ణ, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు క్యూలో నిల్చున్న భక్తులు

సచివాలయాల్లో ముసాయిదా జాబితాలు

కంచికచర్ల: రబీ సీజన్‌లో పంట నమోదుకు సంబంధించిన ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం గ్రామ సచివాలయాల నోటీస్‌బోర్డులో ఉంచినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కె.వి జయకుమార్ తెలిపారు. మండలంలోని చెవిటికల్లు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆయా జాబితాలను రైతులు పరిశీలించాలని కోరారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడమే ధ్యేయంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం రైతులతో కలిసి మిర్చి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం: ఆర్డీఓ



నందిగామటౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తుందని నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్–2047లో భాగంగా 2029నాటికి అందరికీ గృహాలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అందులోభాగంగా భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా ఆర్థిక సహకారం అందించేలా జీవో నంబరు 9 విడుదల చేసిందని తెలిపారు. ఈ జీవో ప్రకారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జన్‌మన్ పథకాల కింద ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు యూనిట్ ఖర్చుకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీ లబ్ధిదారులకు రూ.లక్ష వరకు అదనపు ఆర్థిక సహకారం అందుతుందని వివరించారు. డివిజన్‌లో ఈ పథకం కింద ఎస్సీలు 1,495మంది, ఎస్టీలు 175, బీసీలు 1,124 మంది లబ్ధి చేకూరనుందని వివరించారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహకారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు : కలెక్టర్

నందిగామరూరల్: రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ ఆదేశించారు. మండలంలోని అంబారుపేట, అడవిరావులపాడు గ్రామాల్లోని రక్షిత మంచి నీటి పథకం ట్యాంకులు, బోరులు, బావులను బుధవారం ఆయన పరిశీలించారు. అంబారుపేటలోని మంచినీటి ట్యాంకులను పరిశీలించి ట్యాంకును ఎన్ని రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. గ్రామంలోని బోరు పంపు నీటిని తాగి స్వచ్ఛతను పరిశీలించారు. అనంతరం మండలంలోని అడవిరావులపాడులో ఉన్న రక్షిత మంచి నీటి పథకాలను పరిశీలించి ఫ్లషింగ్, పూడికతీత, బోరు బావులు, నేల బావుల లోతు పెంచడం తదితర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయటంతోపాటు ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు, ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.


సాగు నీరందించాలని రైతుల వినతి..

గ్రామాల పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను నందిగామ మున్సిపాలిటీ పరిధిలోని అనాసాగరం గ్రామానికి చెందిన రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌లో పంటలు సాగుచేయగా అకాల వర్షాలు, వరదల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రబీలో వరిపంట సాగుచేయగా పొట్టదశలో నీటిసరఫరా నిలిచిపోవడంతో పంట ఎండు దశకు చేరుతుందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటలోని చెరువు కింద 150ఎకరాలలో పంట సాగు చేశామని చెరువు నీటిని విడుదల చేయకపోవడంతో పంటను నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. అంతేకాకుండా కాకుల పొన్నవరం నుంచి శనగపాడు సప్లయ్ ఛానల్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో మరో 400 ఎకరాలకు నీటి సమస్య నెలకొందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సమస్యను పరిశీలించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కె.బాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, డీఈ మూర్తి, తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ ఐలపోగు రమ, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబారుపేటలో బోరు నీటిని తాగి పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పదేళ్లలో మూడుసార్లు కిడ్నీ మార్పిడి



లబ్బీపేట(విజయవాడతూర్పు): గర్భిణిగా ఉన్న సమయంలో ఓ మహిళకు తలెత్తిన హార్మోన్ల అసమతుల్యత కారణంగా కిడ్నీలు ఫెయిల్యూర్‌కు దారితీయగా.. పదేళ్లలో మూడుసార్లు కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చింది. నందిగామకు చెందిన 30ఏళ్ల మహిళకు మూడోసారి కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కిడ్నీ వ్యాధుల నిపుణులు డాక్టర్ జి. శరత్‌బాబు తెలిపారు. సూర్యారావుపేటలోని ఆస్పత్రిలో బుధవారం విలేకరులతో మాట్లా డుతూ ఓ మహిళ గర్భిణిగా ఉన్నప్పుడు తలెత్తిన సమస్య కారణంగా కిడ్నీలు డ్యామేజ్ అయ్యాయన్నారు. 2015లో తొలుత తల్లి కిడ్నీదానం చేయగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. మరలా ఫెయిల్యూర్‌కు దారితీయగా రెండోసారి ఆమె భర్త కిడ్నీదానం చేసినట్లు తెలిపారు. తాజాగా తండ్రి కిడ్నీ దానం చేయడంతో ఆమెకు మూడోసారి కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకున్నట్లు తెలిపారు. తనకు కిడ్నీలు దానం చేసిన కుటుంబసభ్యులకు, విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులకు ఆమహిళ కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి చైర్మన్ జి. వెంకట్రావు, డాక్టర్ జి.ప్రశాంతి, యూరాలజిస్ట్ డాక్టర్ ధీరజ్ పాల్గొన్నారు.